
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
5★★★ జిల్లా వార్తలు
ఆదివారం 31 ఆగస్టు 2025



భూ హక్కులపై ఆశలు

- హైకోర్టు గ్రీన్ సిగ్నల్‌తో మోక్షం కలుగుతుందని ధీమా
- పెండింగ్‌లో 15వేల సాదా బైనామాలు దరఖాస్తులు
- భూభారతిలో కొత్తగా 1675 దరఖాస్తులు..



(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సాదాబైనామా లకు అడ్డుగా ఉన్న కోర్టు కేసు తొలగిపోవడంతో ఇకనైనా నిరీక్షణకు తెరపడుతుందని రైతుల్లో ఆశలు మొదలయ్యాయి. సాదా బైనామాల రిజి స్ట్రేషన్‌లను వ్యతిరేకిస్తూ హైకోర్టులో దాఖలైన పిటిషన్ కొట్టివేసింది. 2020లో హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేసింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2020 సంవత్సరంలో తీసుకువచ్చిన 112 జీవో స్థానంలో కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చింది. రైతులు భూభారతిలో సాదా బైనామాలకు పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నట్లుగానే ప్రభుత్వం సాదాబైనామాల పరిష్కారంపై విధివిధానాలను హైకోర్టుకు సమర్పించి కేసును కొట్టి వేయించింది. సాదాబైనామాల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని రైతుల్లో ధీమా ఏర్పడింది. సాదా బైనామాల క్రమబద్ధీకరణ దరఖాస్తులను పరిశీలించి పట్టాదారు పాసు పుస్తకాలను జారీ చేయాల్సి ఉండగా వివిధ కారణాలతో గత ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టింది.

కోర్టులో దాఖలైన పిటిషన్లకు గత ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతోనే పరిష్కారం లభించలేదు. దీంతో రైతులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలకు దూరమయ్యారు. రైతుబంధు, రైతుబీమా, బ్యాంకు రుణాలు, రుణమాఫీ వంటి పథకాలను అందుకోలేకపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, రైతుబీమా, ఫసల్ బీమా వంటివి అందించే దిశగా సాదాబైనామాలను క్రమ బద్ధీకరించే చర్యల్లో భాగం గానే ఆర్వోఆర్-2024 చట్టం ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. కోర్టు కేసు తొలగిపోవడంతో వేగంగా సాదాబైనామా దరఖాస్తులు పరిష్కారం అవుతాయని, రైతులకు ఊరట కలుగుతుందని భావిస్తున్నారు.

గత ప్రభుత్వం ప్రకటించినా..

సాదాబైనామాలకు చట్టబద్ధత కల్పించి క్రమబద్ధీకరిస్తామని గత ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలోకి రాలేదు. గత ప్రభుత్వం నిర్ణయించి దరఖాస్తులు తీసుకున్నా ముందుకు సాగని పరిస్థితి ఏర్పడింది. కాంగ్రెస్ ప్రభుత్వం తెల్లకాగితం ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ భూభారతి బిల్లు 2024 ద్వారా సాదాబైనామాలతో క్రమబద్ధీకరణకు భూ భారతి పోర్టల్ ద్వారా రైతులందరికి పట్టాదారు పాసుపుస్తకాలు అందించాలని నిర్ణయించారు. గత ప్రభుత్వం 2020 సంవత్సరం నవంబరు వరకు సాదాబైనామాల దరఖాస్తులను స్వీకరించింది. రాజన్న సిరిసిల్ల జిల్లాలో 15 వేల మంది దరఖాస్తులు చేసుకున్నారు. మీ సేవా ద్వారా చేసుకున్న దరఖాస్తుల్లో సిరిసిల్ల మండలంలో 428, వేములవాడ మండలంలో 675, వేములవాడ రూరల్‌లో 1072, ఎల్లారెడ్డిపేటలో 1227, తంగళ్లపల్లిలో 1776, ముస్తాబాద్‌లో 1685, గంభీరావుపేటలో 1403, చందుర్తిలో 1259, బోయినపల్లిలో 764, కోనరావుపేటలో 2690, రుద్రంగిలో 162, వీర్నపల్లిలో 379 మంది దరఖాస్తులు వచ్చాయి. వీటిని క్రమబద్ధీకరించే మిగతా 8వ పేజీలో..

భూభారతిలో కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు..

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ధరణి భూ సమస్యలకు పరి ష్కారం చూపకపోగా, పట్టాదారులకు కొత్త సమస్యలను తెచ్చి పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం ధరణి స్థానంలో భూ భారతిని తీసుకురావడంతో రైతుల్లో మళ్లీ భూ సమస్యలు తీరుతాయని ఆశగా ఎదురుచూశారు. భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై మళ్లీ కుప్పలు తెప్పలుగా దరఖాస్తులు వచ్చాయి. భూభారతి సదస్సులో అసైన్డ్ భూముల సమ స్యలతో పాటు సాదా బైనామాలపైన ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా 67 87 దర ఖాస్తులు రెవెన్యూ సదస్సులో వచ్చాయి. వీటిలో సాదాబైనామా దరఖాస్తులు 1675 వచ్చాయి. దరఖాస్తుల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు కస రత్తు ప్రారంభించారు. జిల్లాలో ప్రధానంగా రైతు ల ఎదుర్కొంటున్న సమస్యల్లో దాదాపు 10 ఏళ్లుగా ఇబ్బందిపెడుతున్న సమస్య సాదాబైనామాలు ప్రధానంగా ఉన్నాయి. సాదాబైనామాలు పరిష్కారం పేరిట గత ప్రభుత్వం 2016లో జీవో నంబర్ 153 తీసుకువచ్చింది. 2014 జూన్ 2వ తేదీ ముందు సాదా బైనామాతో భూములు కొను గోలు చేసిన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిం చారు. చట్టబద్ధత కల్పించాలని భావించారు. ఇందుకోసం 2020 అక్టోబరు 12న జీవో నంబరు 112 జారీచేసింది. దీనికి సంబంధించి మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ఏర్పాటు చేసింది. సాదాబైనామాలపై తహసీల్దార్‌లకు అధికారాలు ఇచ్చిన మార్గదర్శకా లు ఇవ్వక పోవడంతో సమస్యలు మాత్రం పరిష్కరించలేదు. హైకోర్టు నాటి స్టేను ఎత్తివేయడంతో పదేళ్ల నిరీక్షణకు తెరపడింది.

చిన్నారి వైద్యానికి కలెక్టర్ ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం చెక్కును అందిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

సిరిసిల్ల కలెక్టరేట్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : చిన్నారి వైద్యానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆర్థికంగా చేయూతను అందించారు. సిరిసిల్ల పట్టణంలోని శివనగర్‌కు చెందిన వేముల మధు దంపతులకు కవలలు కూతురు, కొడుకు జన్మించారు. అనారోగ్య సమస్యతో కూతురు ఆసుపత్రిలో మృతిచెందగా కొడుకు హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తమ కొడుకు వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని వేముల మధు ఇటీవల కలెక్టర్‌ను కలిసి విన్నవించారు.దీంతో వెంటనే స్పందించిన కలెక్టర్ చిన్నారి వైద్యానికి రూ.50వేల చెక్కును శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో వేముల మధుకు అందించి చిన్నారి చికిత్సకు భరోసా కల్పించారు.

● క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం

సిరిసిల్ల పట్టణానికి చెందిన బోనాల వెంకటేష్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. తన వైద్యానికి ఆర్థిక సహాయం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి విన్నవించి కోరడంతో దీంతో స్పందించిన కలెక్టర్ వెంకటేష్ వైద్యానికి రూ.లక్షా25వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి



గంభీరావుపేటలో పంటలను పరిశీలిస్తున్న రెడ్డబోయిన గోపి

గంభీరావుపేట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): భారీవర్షాలకు పంటలు దెబ్బతిన్నాయని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బాధిత రైతులను ఆదుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి డిమాండ్ చేశారు. గంభీరావుపేట మండలంలో అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను శనివారం గోపి పరిశీలించారు. ఈ సందర్భంగా గోపి మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా పంట పొలాలను వరదలు ముంచెత్తాయని, పంటలు నీట మునగడంతో పాటు ఇసుక మేటలు వేశాయన్నారు. పంట పొలాలను పరిశీలిస్తే తిరిగి సేద్యంకు పనికి రాకుండా అయ్యాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి పంట నష్టాలను అంచన వేసి, బాధిత రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్, మాజీ అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శులు మల్లేశ్‌యాదవ్, విగ్నేష్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వాజీద్, నాయకులు రాజేందర్‌రెడ్డి, రాజుగౌడ్, నాగరాజుగౌడ్, సత్యనారాయణ, చంద్రం యాదవ్, బాలరాజు, ఎల్లం, అనిల్ తదితరులు ఉన్నారు.

లోలెవల్ వంతెన నిర్మించాలంటూ రైతుల నిరసన



లోలెవల్ వంతెన నిర్మించాలని నిరసన తెలుపుతున్న రైతులు

ఇల్లంతకుంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దలింగాపూర్ గ్రామసమీపంలో లోలెవల్ వంతెన నిర్మించాలని రైతులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని బతుకమ్మ చెరువు నుంచి పంగిడి చెరువుకు నీరు వెళ్లే మార్గంలో పల్లెమీది ఒర్రె ఉందన్నారు. నీరు వస్తున్న ప్రతిసారి రైతులు మూడు కిలోమీటర్ల దూరం తిరగాల్సి వస్తోందని, ఒర్రెపై లోలెవల్ వంతెన నిర్మిస్తే వ్యవసాయ బావుల వద్దకు పోవడానికి, నర్సింహ్ములపల్లె గ్రామానికి వెళ్లడానికి సులభంగా ఉంటుందన్నారు. ఒర్రెపై వంతెన నిర్మాణం చేయాలని అనేకసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు.గతంలో ఒకసారి పైపులు తీసుకవచ్చి వదిలిపెట్టిపోయారన్నారు. ప్రభుత్వం స్పందించి లోలెవల్ వంతెనకు నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో అమ్ముల అశోక్‌యాదవ్, దుమాల శ్రీకాంత్, పయ్యావుల మల్లేశం, గాదె మధు, పయ్యావుల మల్లేశం, కముటం శ్రీనివాస్, లచ్చయ్య, ఎల్లం, చంద్రయ్య, శ్రీదర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలని ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ



సిరిసిల్లలో ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : సీపీఎస్‌ను రద్దు చేయాలి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలంటూ పీఆర్టీయూటీఎస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయులు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కొత్తబస్టాండ్ నుంచి అంబేద్కర్ చౌక్ మీదుగా గాంధీచౌక్ వరకు ఉపాధ్యాయుల బైక్ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు గన్నమనేని శ్రీనివాసరావు మాట్లాడారు. పాత పెన్షన్ విధానాన్ని ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులందరికి వర్తింపచేయాలని పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో పలుమార్లు ప్రభుత్వం, ఉన్నత విద్యాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సీపీఎస్‌ను రద్దు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయుల జీవితాల్లో వెలుగులు నింపాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తిచేశారు. సీపీఎస్ అంతం పీఆర్టీయూటీఎస్ పంతం నినాదంతో 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియామకమైన ఉద్యోగ ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానంను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలుచేయాలని సెప్టెంబరు 1న చలో హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద మహాధర్నాకు ఉపాధ్యాయులను సన్నద్ధం చేస్తూ బైక్ ర్యాలీ నిర్వహించామన్నారు. సీపీఎస్ రద్దు పాతపెన్షన్ విధానం అమలు కోసం చేపడుతున్న మహాధర్నాకు జిల్లాలోని ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూటీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల కిషన్, గౌరవ అధ్యక్షుడు కామినేని శ్రీనివాస్, గుర్రం మల్లారెడ్డి, చిప్పయాదగిరి, రాజు, అనిల్, మధు, మహేష్, నవీన్, శ్రీనివాస్, షఫీ, ప్రవీన్‌కుమార్, రవీందర్, పరశురాములు, ఆనంద్, మల్లారెడ్డి, ప్రతాప్, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, పలు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

సాంకేతిక విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్‌డబ్ల్యూవో లక్ష్మీరాజం

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు30 : విద్యార్థులు సాంకేతిక విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం అన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాలలో కొనసాగుతున్న ఐఐటీ, నీట్, ఫౌండేషన్ అన్ అకాడమీ తరగతుల నిర్వహణను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఎస్‌డబ్ల్యూవో లక్ష్మీరాజం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు కార్పోరేటు స్థాయి విద్యార్థులకు దీటుగా రాణించాలని అన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు శ్రద్ధ వహించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ సిబ్బంది రోజా, రమ్య, ప్రిన్సిపాల్ అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బోధనా మెళకువలతో విద్యార్థుల్లో అభ్యాసన పెంపు

- జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ శైలజ



బోధన పరికరాలను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బోధనా మెళకువలతో విద్యార్థులలో అభ్యాసన పెంచవచ్చని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ శైలజ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి బోధన అభ్యాస సామగ్రి మేళను జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ శైలజతో కలసి డీసీఈబీ సెక్రెటరీ వీఎం శ్రీనివాస్, మండల విద్యాధికారి దూస రఘపతి ప్రారంభించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులలో తెలుగు, ఆంగ్లం, ఈవీఎస్, గణిత శాస్త్రంలో ఏవిధంగా బోధన పరికరాలను ఉపయోగించి సులభంగా అర్థం చేయవచ్చునో మేళాలో ప్రదర్శించిన బోధన పరికరాలను పరిశీలించారు. మండల స్థాయిలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు నో కాస్ట్‌తో తయారుచేసిన బోధన పరకరాల గురించి ఉపాధ్యాయులు వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. మేళా ద్వారా బోధన మెలుకువలను పరస్పరం తెలుసుకొనవచ్చునన్నారు. బోధన పరికరాలతో విద్యార్థులలో విద్యా అభ్యాసనను మరింత పెంచవచ్చునన్నారు. మండల స్థాయిలో అత్యుత్తమ బోధన పరికరాలను తయారు చేసిన వారిని ఎంపిక చేసి జిల్లా స్థాయి మేళాకు పంపిస్తామన్నారు. మేళాలో వి హరిప్రసాద్, ఎం పరమేశ్వర్, బి అరుణ, వై నందిని, బి సుమన్, కే మమత, బి శ్రీకాంత్, ఏ మాధవి, అదిబారిన్ అంకుల్, బషీర్ ఎంపికయ్యారు. జిల్లాస్థాయి మేళాకు ఎంపికైన ఉపాధ్యాయులను మండల విద్యాధికారి దూస రఘపతి, ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల మండల పాఠశాల కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు శారద, మోతీలాల్, శ్రీనివాస్, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, జీఆర్‌పీలు, సీసీవోలు పాల్గొన్నారు.

రాజన్న ఆలయ ఈవోగా బాధ్యతలు చేపట్టిన రమాదేవి

- స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న ఈవో



శ్రీస్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న ఈవో రమాదేవి 7

బడి తోట.. పోషకాల బాట..

- ఆరేళ్లుగా సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు



తోట పని చేస్తున్న విద్యార్థులు 7

యూరియా కోసం రైతుల ఇబ్బందులు కనిపించడం లేదా?

- మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



సమావేశంలో మాట్లాడుతున్న రసమయి బాలకిషన్

ఇల్లంతకుంట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కోసం పడుతున్న ఇబ్బందులు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రశ్నించారు. మండలంలోని దాచారం గ్రామంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రైతులు యూరియా కోసం కొనుగోలు కేంద్రాల వద్ద క్యూ కడుతుంటే ప్రతిపక్షాల కుట్ర అని పేర్కొంటు రైతులను ప్రభుత్వం అవమానిస్తుందని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఏనాడు రైతులు యూరియా కోసం ఇబ్బంది పడలేదన్నారు. సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి చేతకానితనం వల్లనే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందన్నారు. బూటకపు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులకు పరిపాలన చేతకావడం లేదన్నారు. భారీవర్షాలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే కనీసం పట్టించుకునే వారు కరువయ్యారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి యూరియా కొరత తీర్చాలని లేనట్లయితే రైతుల పక్షాన ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. తొలుత బోటిమీదిపల్లె, దాచారం గ్రామాలలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్దం వేణు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహారెడ్డి, నాయకులు కేవీఎన్‌రెడ్డి, మీసరగండ్ల అనీల్‌కుమార్, బాలకిషన్, సంజీవరెడ్డి, కుడుముల నాగరాజు, భాస్కర్, బర్ల తిరుపతి, పర్శరాం, గౌరవేని సుమన్, దేవయ్య పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


అజిత్ పాషా మృతదేహం

కోల్‌సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని గాంధీనగర్‌కు చెందిన మహమ్మద్ అజిత్‌పాషా(32) అనే యువకుడు శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. అజిత్‌పాషా రెండు సంవత్సరాల నుంచి మానసిక అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే ఉంటున్నాడని, శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు తెలిపారు. తెల్లవారి ఉదయం 10గంటలకు పక్కింటి వారు పిలిచినా ఎంతకీ తలుపు తీయకపోయే సరికి ఆసుపత్రిలో ఉన్న అజిత్ పాషా భార్యకు తెలిపారు. ఆమె వచ్చి చూడగా ఆత్మహత్య చేసుకొని ఉన్నాడన్నారు. అజిత్ పాషా భార్య ఆయేషా జబీన్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

రాచర్లగొల్లపల్లిలో వివాహిత బలవన్మరణం


లావణ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లగొల్లపల్లిలోని వివాహిత ఎలగందుల లావణ్య(35) కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని బలవన్మరణానికి శనివారం ఒడిగట్టిందని స్థానికులు, పోలీసులు తెలిపారు. వారి కథనం మేరకు.. గ్రామంలోని లావణ్యకు కుటుంబ సభ్యుల నడుమ నెలకొన్న చిన్నపాటి గొడవ చోటు చేసుకుందని పేర్కొన్నారు. దాంతో మనస్థాపం చెందిన ఆమె ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని చెప్పారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని వివరించారు. మృతురాలికి భర్త భాస్కర్, పిల్లలు శాన్వి, రిషిలు ఉన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

కరీంనగర్ క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చేపల వేటకు వెళ్లి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయి గల్లంతైన ఉత్తరప్రదేశ్ రాష్ట్రం సంతకబీర్ జిల్లా గిరిధర్‌పూర్‌కు చెందిన మదుర్ రహమాన్(21) మృతదేహం శనివారం లభ్యమైందని కొత్తపల్లి పోలీసులు తెలిపారు. రహమాన్ ఆరు నెలల క్రితం కరీంనగర్‌కు వచ్చి ఇక్కడే కశ్మీర్‌గడ్డలోరి ఒక మేస్త్రీ వద్ద పని చేస్తున్నాడు. ఈనెల28న మరో నలుగురు స్నేహితులతో కలిసి చింతకుంటలోని ఎస్‌ఆర్‌ఎస్‌పీ కెనాల్‌లో చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీటిలోపడి గల్లంతయ్యాడు. అప్పటినుంచి పోలీసులు గజ ఈతగాళ్లతో వెదుకుతుండగా రహమాన్ మృతదేహం కాలువకు కొంతదూరంలో మానేరు జలాశయంలో లభ్యమైందని పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి అబ్దుల్ సలాం ఫిర్యాదుతో కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని తెలిపారు.

మానేరు వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

తంగళ్లపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం మండేపల్లి శివారులో మానేరు వాగులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం గుర్తించినట్లు ఎస్‌ఐ ఉపేంద్రచారి తెలిపారు. మృతుడి వయస్సు 55-60ఏళ్ల మధ్య ఉంటుందని తెలిపారు. శనివారం మానేరు వాగు సమీపంలో కిషన్ అనే రైతు వ్యవసాయ పొలం వద్ద మృతదేహం ఉందని గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని పంచనామా నిర్వహించి మృతదేహం కుళ్లిన స్థితిలో ఉండడంతో డాక్టర్ అక్కడే పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేసినట్లు తెలి పారు. సుమారు నెలరోజుల క్రితం మృతిచెంది ఉంటాడని ఎస్‌ఐ తెలిపారు.

వ్యాపారి ఇంటిలో పట్టపగలు చోరీ

● బంగారు ఆభరణాలు అపహరణ

ధర్మపురి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఆంగ్లోవేదిక్ స్కూల్‌సందిలో గల వ్యాపారి కోలేటి మల్లిఖార్జున్ ఇంటిలో శనివారం పట్టపగలు గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి బంగారు నగలు అపహరించారు. మల్లిఖార్జున్ స్థానిక కూరగాయల మార్కెట్ సమీపంలో రెడిమేడ్ బట్టల షాపు నిర్వహిస్తున్నాడు. ఉదయం ఆయన భార్య మంచిర్యాలలోని తన తండ్రి ఆపరేషన్ అయితే చూసేందుకు వెళ్లింది. రాత్రి వేళలో ఇంటికి వెళ్లే సరికి మల్లిఖార్జున్ ఇంటి తాళాలు పగులగొట్టి బీరువా తెరచి ఉన్నట్లు గమనించాడు. అందులోని బంగారాన్ని అపహరించుకుని వెళ్లిపోయారు. సంఘటనాస్థలాన్ని ఎస్‌ఐ ఉదయ్‌కుమార్ పరిశీలించి వివరాలు సేకరించారు.

అందుబాటులో ఆపద్బాంధవులు



● ఒకే వేదికపై నాలుగు లక్షల మంది రక్తదాతలు
● ఏడు దేశాల్లో సేవలు

చొప్పదండి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం బ్లడ్ బ్యాంకుల చుట్టూ తిరిగితే స్టాక్ లేదని, దాతలు అందుబాటులో లేరని, సమయం గడిచిపోతుందని, మీ బంధువులు లేదా సన్నిహితులు సరైన సమయంలో రాకపోవడంతో రోగి పరిస్థితి చూసి ఆందోళనపడిన సందర్భాలు ఎన్నో చూస్తుంటాం.. కొన్ని సమయాల్లో సరైన సమయంలో రక్తం దొరకక రోగులు, ప్రమా దంలో గాయపడ్డవారు మరణించిన సందర్భాలు అనేకం. దీనికి పరిష్కారం చూపే దిశగా లక్షలాది మం ది రక్తదాతలను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది friends2support.org (ఫ్రెండ్స్2 సపోర్ట్.ఆర్గ్) వెబ్‌సైట్. ప ట్టణం నుంచి ప్రపంచంలోని పలు దేశాల వరకు విస్త రించి ఎంతో మందికి ఆపదలో ఆదుకుం టు న్నది. అ త్యంత అరుదైన బాంబే బ్లడ్ గ్రూప్ రక్తదాతలు సైతం ఈ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండడం విశేషం.

● రక్తదాతలను సంప్రదించడం ఇలా?



రక్తం అవసరం ఉన్నవారు మొబైల్‌లో ఫ్రెండ్స్2 సపోర్ట్.ఓఆర్‌జి లింకును క్లిక్ చేయగానే వెబ్‌సైట్ ఓపెన్ అవుతుంది. ఇందులో ఫైండ్ బ్లడ్ డోనర్స్ అని కనిపిస్తుంది. అందులో మనకు కావాల్సిన బ్లడ్ గ్రూపు ఎంపిక చేసుకోవాలి. తర్వాత దేశం, రాష్ట్రం, జిల్లాను ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత మన ద్గగరలో ఉన్న పట్టణాన్ని ఎంపిక చేసుకుంటే రక్తదాతల వివరాలు కనిపిస్తాయి. రక్తదాత పేరు, ఫోన్ నంబర్‌తో కూడిన దాతల జాబితా అందుబాటులో ఉంటుంది. జాబితా నుంచి మనం రక్తదాతలను సంప్రదిస్తే ఎవరో ఒకరు రక్తం అందిస్తారు. మన దేశం, విదేశాల్లో ఆపదలో ఉన్నవారికి రక్తదాత కోసం ఈ వెబ్‌సైట్ ఉపయోగించుకోవచ్చు.

● మొబైల్ ద్వారా..

హైదరాబాద్‌కు చెందిన కొంతమంది మిత్రులతో కలిసి రూపొందించిన ఫ్రెండ్స్2సపోర్టు.ఓఆర్‌జి వెబ్‌సైట్ రక్తనిధిగా మారింది. అరచేతిలో లక్షలాది మంది రక్తదాతల సమాచారాన్ని క్షణాల్లో రక్త గ్రహీతలకు చేరవేస్తుంది. 2005లో కేవలం వంద మంది రక్తదాతలతో ప్రారంభమైన ఈ వెబ్‌సైట్ ప్రస్తుతం 4లక్షల మందికిపైగా స్వచ్ఛంద రక్తదాతలు నమోదై ఉండి రక్తగ్రహీతలకు ఆపదలో అండగా నిలుస్తోంది. అత్యంత విలువైన మానవ జీవితాన్ని కాపాడడానికి రక్తదానం చేయాలని పిలుపునిస్తూ వెబ్‌సైట్ ద్వారా స్వచ్ఛంద రక్తదాతలను దేశవ్యాప్తంగా పట్టణాల నుంచి నమోదు చేస్తున్నారు. రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉన్న దాతలు, రక్తగ్రహీతలకు ఈ వెబ్‌సైట్ ఒక వేదికగా నిలుస్తున్నది. స్వచ్ఛంద రక్తదాత కోసం వెతికే ప్రతి ఒక్కరికి రక్తాన్ని అందజేయాలనే ఆశయంతో ఈవెబ్‌సైట్ పనిచేస్తున్నది. దేశంలోని 28రాష్ట్రాల్లో వివిధ నగరాలు, పట్టణాలతోపాటు మండల కేంద్రాల్లో ఈ వెబ్‌సైట్‌లో నమోదైన స్వచ్ఛంద రక్తదాతల వివరాలు అందుబాటులో ఉన్నాయి. భారత్‌తోపాటు నేపాల్, శ్రీలంక, బంగ్లాదేశ్, మలేషియా, ఓమన్, యెమన్ దేశాలలో కూడా ఈ వెబ్‌సైట్‌లో రక్తదాతలు నమోదై ఉండి అవసరైన వారికి సేవలందిస్తున్నారు.

● అందుబాటులో బాంబే బ్లడ్ గ్రూప్ దాతలు..

2007లో గోపిచంద్ హీరోగా వచ్చిన ఒక్కడున్నాడు అనే సినిమాలో విలన్ బాంబే బ్లడ్ గ్రూపు ఉన్న వ్యక్తి కోసం వెతుకుతుంటాడు. హీరోది అదే బ్లడ్ గ్రూపు అని తెలుసుకుని వారిద్దరి మధ్య సాగే సినిమా ఆద్యంతం ప్రేక్షకులను మెప్పించింది. అత్యంత అరుదైన బాంబే బ్లడ్ గ్రూపు రక్తం ఇతివృత్తంగా ఈ సినిమా తెర కెక్కగా అప్పటివరకు చాలామంది ప్రజలకు బాంబే బ్లడ్ గ్రూపు ఉంటుందని కూడా ఎవరికి తెలియదు. కాగా అలాంటి అత్యంత అరుదైన బాంబే బ్లడ్ గ్రూపు స్వచ్ఛంద దాతలు కూడా ఈ వెబ్‌సైట్‌లో నమోదై ఉండడం విశేషం.

గుడిమిట్టపల్లి ఆలయంలో చోరీ


దేవాలయం సమీపంలోని చెట్ల మధ్య హుండీ

సుల్తానాబాద్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ శివారులోని గుడిమిట్టపల్లిలోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో దొంగలు పడ్డారు. శనివారం ఉదయం పూజారి ఆలయానికి రాగా చోరీ విషయం వెలుగు చూసింది. దీంతో సమీప ప్రజలకు అలాగే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దొంగతనం సంఘట నను పరిశీలించారు. ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో క్లూస్‌టీం ఆలయానికి వచ్చి వేలిముద్రలు సేకరించారు. ఆలయ పూజారి అశోక్ మాట్లాడుతూ గుర్తుతెలియనివ్యక్తులు ఆలయం ఆవరణలో మద్యం సేవించారని, సమీపంలో నివాసం ఉంటున్న రైతుగేదెను కట్టేయడానికి ఏర్పాటు చేసిన గడ్డపారతో గుడితాళాన్ని తొలగించారని చెప్పారు. ఆలయంలోని బీరువాను పగులకొట్టి అందులోఉన్న నగదు తీసుకున్నారని, హుండీని వెంట తీసుకుపోయారని చెప్పారు. ఆలయానికి కొద్దిదూరంలో హుండీని పగులకొట్టి డబ్బులను తీసుకుపోయారన్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పోతలింగన్న విగ్రహం ధ్వంసం

ఓదెల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొత్కపల్లి గ్రామంలోని పోచమ్మ గుడి వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పోతలింగన్న విగ్రహాన్ని ధ్వంసం చేశారు. గ్రామస్థులంతా యేటా పోచమ్మ గుడివద్దకు వచ్చి పోతలింగన్నతో పాటు పోచమ్మకు నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహిస్తారు.

క్రిప్టోకరెన్సీ స్కీం పేరుతో రూ.55లక్షల మోసం

● పరారీలో ఇద్దరు నిందితులు ● కేసు నమోదు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మెటాఫండ్ క్రిప్టోకరెన్సీస్కీంలో పెట్టుబడులు పెడితే 10నెలల్లో మూడురెట్ల డబ్బులు వస్తాయని నమ్మించి ఎనమిది మంది బాధితుల వద్ద 55లక్షల రూపాయలు కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో కరీంనగర్ రెండోఠాణా పోలీసులు జులై17న కేసు నమోదుచేశారు. బాధితుడు పుప్పాల శ్రీకర్ తెలిపిన కేసు వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లాకేంద్రంలోని కశ్మీర్ గడ్డకు చెందిన పుప్పాల శ్రీకర్‌కు కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి శ్రీరామ టింబర్ డిపో యజమాని జ్యోతినగర్‌కు చెందిన దాసరి రమేష్‌తో పరిచయం ఉంది. బాధితుడు శ్రీకర్‌తో ఒకరోజు దాసరి రమేష్ మాట్లాడుతూ మెటాఫండ్ క్రిప్టోకరెన్సీ గురించి చెప్పాడు. తాను మెటాఫండ్ క్రిప్టోకరెన్సీ స్కీంలో పెట్టుబడి పెట్టి రోజుకు 6లక్షలు సంపాదిస్తున్నానని, దీనిలో మీరు కూడా 50 లక్షలు పెట్టుబడి పెడితే 10నెలల్లో మూడురెట్లు (1కోటి65 లక్షలు) డబ్బులు వస్తాయని నమ్మించాడు. కావాలంటే రోజూ లేదా నెల నెలా లాభం తీసుకోవచ్చని చెప్పాడు. దీనిని నమ్మిన శ్రీకర్ 2024మే 27న శ్రీరామ టింబర్ డిపోలో ఉన్న దాసరి రమేష్ వద్దకు వెళ్లి 20లక్షల నగదు ఇచ్చాడు. మొత్తం 50 లక్షలు పెడితేనే సెక్యూరిటీగా తాను హైదరాబాద్‌లోని ప్లాట్ రిజిస్ట్రేషన్ చేస్తానని రమేష్ చెప్పగా, శ్రీకర్ బంధువులు, స్నేహితులు మరో ఏడుగురి వద్ద మరో 35 లక్షల వరకు మొత్తం 54లక్షల65వేల రూపాయలు దాసరి రమేష్‌కు ముట్టజెప్పారు. మెటాఫండ్ క్రిప్టోకరెన్సీ స్కీంలో పెట్టుబడిగా ఇచ్చిన ఎనమిది మంది డబ్బులకు రమేష్ వరుసకి సోదరుడైన దాసరి రాజు చేత బాధితులకు ఒక్కో ఐడీ క్రియేట్‌చేసి ఇచ్చాడు. అందులో డాలర్లు జమ అయినట్లుగా చూపించాడు. 10 నెలల తరువాత మాడబ్బులు 3రెట్లు ఇస్తామన్నావు కదా ఇవ్వమని బాధితులు అడగగా దాటవేస్తూ తప్పించుకు తిరుగుతున్నాడు. 16 నెలలయినప్పటికీ బాధితులు ఇచ్చిన 55 లక్షలకు ఇంత వరకు ఒక్కరూపాయి తిరిగి ఇవ్వకపోవటంతో బాధితులు శ్రీకర్‌తో కలసి జూలై 14న పోలీస్‌కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. నిందితులు ప్రస్తుతం పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు. నిందితులు బెయిల్ కోసం రెండు సార్లు ప్రయత్నించగా బెయిల్ లభించలేదని సమాచారం. కాగా బాధితుడు శ్రీకర్ మాట్లాడుతూ తాము రమేష్‌ను నమ్మి రూ.55లక్షలు బంధువులు, స్నేహితుల వద్ద అప్పుగా తీసుకుని అప్పజెప్పామని, ఆ డబ్బులకు ఇప్పటి వరకు 16 లక్షల రూపాయలు వడ్డీ చెల్లించామని తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

దాడి సంఘటనలో వ్యక్తిపై కేసు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : దాడిచేసిన సంఘటనలో వీర్నపల్లి మండలం సీతారాంనాయక్ తండాలోని వ్యక్తి బానోతు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మణ్ శనివారం రాత్రి తెలిపారు. గ్రామంలోని బానోతు శ్రీనివాస్ తనకు చెందిన ఆవుదూడను అదే గ్రామానికి చెందిన బానోతు చందు పొలం వద్ద కట్టేశాడు. దీంతో దూడ తన పొలం పొలం మేసిందని శ్రీనివాస్‌ను చందు నిలదీశాడు. ఈక్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఆగ్రహించిన శ్రీనివాస్ కర్రతో చందుపై దాడిచేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్‌ఐ లక్ష్మణ్ వివరించారు.

ఖని ఆసుపత్రిలో చోరీపై సెక్యూరిటీ గార్డులకు 'శిక్ష'

● ఒక్కో గార్డు నుంచి రూ.1600 వసూలు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): చాలీచాలని వేతనాలతో బతుకు బండిని లాక్కువస్తున్న ఖని జనరల్ ఆసుపత్రిలో పనిచేసే సెక్యూరిటీ గార్డులకు పెద్దశిక్ష వేశారు. ఈనెల17న ఆసుపత్రిలో సూపరింటెండెంట్ రూమ్‌నుంచి ఫేస్ రికగ్నైజేషన్‌యంత్రం చోరీకి గురైంది. దానికి ఆసుపత్రిలో పని చేసే 32మంది సెక్యూరిటీ గార్డులను బాధ్యులుగా చేస్తూ ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.1600 వసూలు చేశారు. ఎప్పుడు సీసీ కెమెరాల నిఘాలో ఉండే ఆసుపత్రిలో యంత్రం చోరీపై సెక్యూరిటీ గార్డులను బాధ్యులుగా చేస్తూ జరిమానా విధించారు. ఈ బయోమెట్రిక్ యంత్రం ద్వారా రోజూ వైద్యులు హాజరు నమోదు చేసుకుంటారు. చోరీకి గురైన యంత్రం ఎవరికి అవసరం లేనప్పటికీ గార్డులను బాధ్యులుగా చేయడం సరైంది కాదని గార్డులు వాపోతున్నారు. రూ.50వేల విలువ చేసే ఈ యంత్రం చోరీకి గురికాగా వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ దీనిపై విచారణ జరుగలేదు. చోరీ అయిన సమయంలో సీసీ కెమెరాలు పని చేయకపోవడం పలు అనుమానాలకు దారి తీస్తుంది.

బేకరీలు, స్వగృహఫుడ్స్‌పై ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని స్వగృహ ఫుడ్‌సెంటర్‌లు, బేకరీలు నాణ్యతలేని, గడువు ముగిసిన ముడి సరుకులు ఉపయోగించి ఆహారపదార్థాలు తయారు చేస్తున్నట్లు ఫుడ్‌సేఫ్టీ అధికారులు గుర్తించారు. శనివారం కరీంనగర్‌లోని రెండు బేకరీలు, ఒక స్వగృహఫుడ్స్‌లలో తనిఖీలు నిర్వహించగా గడువు ముగిసిన ఆహారపదార్థాలు పట్టుబడ్డాయి. వంటగదిలో అపరిశుభ్రతను గుర్తించారు. గడువు ముగిసిన బాదంమిల్క్ బాటిళ్లు, ఫుడ్ కలర్స్ వంటనూనె పాకెట్లు, వర్మిసెల్లి, కలర్ చాకెట్లు పట్టుబడగా వాటిని ఫుడ్‌సేఫ్టీ అధికారులు డస్ట్‌బిన్‌లో పారవేశారు. ఈ మేరకు వారికి నోటీసులు జారీ చేశారు. కేసులు నమోదు చేసి జరిమానాలు కూడా విధించనున్నట్లు తెలిపారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన చేపల చెరువు వివాదం


మాట్లాడుతున్న ఎస్సై రమేష్

చందుర్తి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): రెండు జిల్లాల సరిహద్దులలో గల చేపల చెరువు వివాదం శనివారం చందుర్తి పోలీస్ స్టేషన్‌కు చేరింది. రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం కొత్తపేట, జగిత్యాల జిల్లా కథలాపూర్ మండలం తుర్తి గ్రామాల మధ్య అటవీ ప్రాంతంలోగల తీగల కుంట చెరువు వివాదం చందుర్తి పోలీస్ స్టేషన్‌కు చేరింది, రెండు గ్రామాల మధ్య చెరువు ఉండడంతో ఈ చెరువు మా పరిధిలోకి వస్తుందని రెండు గ్రామాలకు చెందిన మత్స్యకారుల సంఘాల సభ్యులు కొద్ది సంవత్సరాలుగా చెరువు వివాదం జరుగుతోంది. కొత్తపేట గ్రామానికి చెందిన మత్స్యకారులు చందుర్తి పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఎస్‌ఐ రమేష్ ఇరు వర్గాలను పిలిపించి తీగలకుంట చెరువుకు రెవెన్యూ అధికారులు హద్దులు నిర్ణయించే వరకు చెరువులోకి చేపలు పట్టేందుకు ప్రవేశించవద్దని వారిని ఆదేశించారు.

మిషన్ భగీరథ పైప్‌ను ఢీకొన్న బస్సు


ధ్వంసమైన ఆర్టీసీబస్సు ఫుట్‌బోర్డు

బీర్‌పూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రంలోని ఆసునూరిగూడెం వద్ద మిషన్ భగీరథ పైపును శనివారం ఆర్‌టీసీ బస్సు ఢీకొనడంతో ఫుట్‌బోర్డు పూర్తిగా విరిగిపోయింది. శనివారం జగిత్యాల నుంచి కొల్వాయి గ్రామానికి వస్తున్న జగిత్యా డిపోకు చెందిన బస్సు బీర్‌పూర్ సమీపంలోని ఆసునూరి గూడెం బ్రిడివద్ద కారును తప్పించబోయి మిషన్ భగీరథ పైపునకు తగిలింది. దీంతో బస్సు ఫుట్ బోర్డు విరిగిపోగా ప్రయాణికులకు ప్రమాదం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు.

కోతుల దాడిలో వృద్ధురాలికి గాయాలు

గొల్లపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కోతుల దాడిలో వృద్ధురాలికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని చిల్వాకోడూర్ గ్రామానికి చెందిన భంగిమఠం ఈరమ్మ తనఇంటి ఆవ రణలో బట్టలు ఉతుకుతుండగా కోతుల గుంపు ఒక్కసారిగా ఆమెపై దాడిచేయడంతో రెండు చేతులు విరిగిపోయాయి. కుటుంబ సభ్యులు జగిత్యాల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఉన్నతాధికారులు స్పందించి కోతుల బెడద నుంచి కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రుణం ఇప్పిస్తానని డబ్బులు వసూళ్లు

● పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

గంగాధర, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అమాయకుల అవసరాలను ఆసరా చేసుకుని లోన్లు ఇప్పిస్తామని డబ్బులు వసూళు చేసిన నిర్వాహకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదుమేరకు నిర్వహకుడిపై కేసు నమోదు చేసి కార్యాలయంలోని రికార్డులు, కంప్యూటర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో అంజనీపుత్ర లోన్స్, ఇన్సూరెన్స్ కన్సల్టెన్సీ పేరుతో బ్రాంచిని ప్రారంభించారు. అన్ని రకాల రుణాలు ఇప్పిస్తాం, ఇన్సురెన్స్ చేయిస్తామని కరపత్రాలతో ప్రచారం నిర్వహించాడు. మండలంలోని పలు గ్రామాలతో పాటు చుట్టుపక్కల మండలాలకు చెందిన పలువురి వద్ద నుంచి వ్యక్తగత రుణాలు, వ్యాపారం కోసం రుణం, వ్యవసాయ భూములపై రుణాలు ఇప్పిస్తానని రూ.5100నుంచి లక్ష వరకు సుమారుగా 20మంది వద్ద వసూలు చేశాడు. అయితే రుణం బ్యాంకులో పడాలంటే ఖర్చులకు మరింత డబ్బులు తీసుకురావాలని నిర్వహకుడు తెలపడంతో శనివారం పెద్ద ఎత్తున ఆవపరులు కార్యాలయానికి చేరుకున్నారు.

రేపు, మాపు అంటూ దాటవేయడంతో బాధితుల్లో ఒకింత అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై వంశీకృష్ణ కార్యాలయానికి చేరుకుని నిర్వహకుడిని అదుపులోకి తీసుకుని ఏఏ రకాల రుణం అందిస్తున్నారు, ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, ఏ బ్యాంకు నుంచి ఇస్తున్నారు, రుణం అందించడానికి మీకు ఎలాంటి అర్హతలున్నాయని వివరాలు అడిగారు. గంగాధర మండలం పత్తికుంటపల్లికి చెందిన పేద రైతుకు రూ.30లక్షల వ్యవసాయ రుణం ఇప్పిస్తానని రూ.60వేలు తీసుకున్నట్లు బాధిత రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

శునకానికి కన్నీటి వీడ్కోలు

గంభీరావుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అల్లారుముద్దుగా పెంచుకున్న శునకం కన్నుమూయడంతో ఆ కుటుంబ సభ్యులు బోరున విలపించారు. అంత్యక్రియలు నిర్వహించి, తుది వీడ్కోలు పలికారు. ఈ సంఘటన రాజన్న సిరిసిల్లజిల్లా గంభీరావుపేటలో శనివారం చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన యాత్వార్ రేణుక, రామకృష్ణ దంపతుల కుమారుడు సంతోష్ లాబ్రాడార్ జాతికి చెందిన ఓ శునకాన్ని మూడున్నరేళ్ల క్రితం హైదరాబాద్‌లో కొనుగోలు చేసితీసుకొచ్చాడు. శునకానికి చెర్రీ అని నామకరణం చేసి అల్లారు ముద్దుగా పెంచుకుంటున్నారు. ఇటీవల చెర్రీ అస్వస్థతకు గురికావడంతో హైదరాబాద్‌లోని పశువైద్యశాలలో వైద్యం చేయించినా శనివారం తెల్లవారుజామున మృతిచెందింది. దీంతో గంభీరావుపేటలో కుటుంబ సభ్యులు శ్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహించి ఖననం చేశారు.


శునకానికి తుది వీడ్కోలు పలుకుతున్న కుటుంబ సభ్యులు

సవతి కొడుకు చేతిలో గర్భిణి దారుణ హత్య

● సంఘటన స్థలాన్ని పరిశీలించిన సీఐ ● నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు


తిరుమల(ఫైల్)

ఇల్లందకుంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండల కేంద్రంలో ఏడు నెలల గర్భిణి సవతి కొడుకు చేతిలో శనివారం రాత్రి దారుణ హత్యకు గురైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇల్లందకుంట మండలం టేకుర్తి గ్రామానికి చెందిన ముద్రవేణ రాములు అదే మండలంలోని కనగర్తి గ్రామానికి చెందిన రేణుకను 25 ఏళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. రాములు జానపద కథలు చెప్పుకుంటూ జీవనం సాగిస్తాడు. వీరికి అభిలాష్, బన్నీతేజ అనే ఇద్దరు కుమారులున్నారు. పిల్లలు పుట్టిన కొంతకాలం తర్వాత భర్తతో గొడవపడి రేణుక పుట్టింటికి వెళ్లిపోయింది. పిల్లలిద్దరూ నానమ్మ వద్దనే ఉంటున్నారు. చాలాసార్లు రేణుక, రాములు మధ్య పెద్ద మనుషుల సమక్షంలో పంచాయతీలు జరిగాయి. కుమారులు ఇద్దరూ కనగర్తికి వెళ్లి తల్లి రేణుకను టేకుర్తి గ్రామానికి తీసుకువచ్చి నానమ్మ ఇంటివద్దనే ఉంటున్నారు. భార్య లేని సమయంలో రాములుకు హుజూరాబాద్ ప్రాంతానికి చెందిన తిరుమల(29)తో పరిచయం ఏర్పడింది. ఎనిమిదేళ్ల క్రితం తిరుమలను రాములు వివాహం చేసుకొని టేకుర్తి గ్రామానికి తీసుకువచ్చి ఓ ఇల్లు నిర్మించి అందులో ఉంటున్నారు. తరుచూ మొదటి భార్య పిల్లలు, రెండో భార్య తిరుమలకు గొడవలు జరుగుతుండేవి. ఈ క్రమంలో తిరుమల గర్భవతి అయింది. ప్రస్తుతం ఆమెకు ఏడు నెలలు. తిరుమలకు పిల్లలు పుడితే ఆస్తుల విషయంలో గొడవలు అవుతాయని రాములు చిన్న కుమారుడు బన్నీతేజ శనివారం సాయంత్రం కత్తితో తిరుమలపై దాడిచేసి గొంతు కోసి చంపాడు. దీంతో తిరుమల రక్తపు మడుగులో విలవిలాడుతూ ప్రాణాలు విడిచింది. అనంతరం అక్కడి నుంచి పారిపోయాడు. విషయం తెలుసుకున్న జమ్మికుంట రూరల్ సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై క్రాంతికుమార్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ర్యాగింగ్ రక్కసిని అరికట్టాలి

● జిల్లా అదనపు న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు

కోల్‌సిటీ, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యాసంస్థల్లో ర్యాగింగ్ రక్కసిని అరికట్టాలని, ఆ దిశగా ప్రతీఒక్కరు పాటుపడాలని జిల్లా అదనపు న్యాయమూర్తి డాక్టర్ టీ శ్రీనివాసరావు అన్నారు. శనివారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ర్యాగింగ్‌కు పాల్పడితే జైలు శిక్షతోపాటు, విద్యాసంస్థల నుంచి సస్పెండ్ తప్పదన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. ఎంచుకున్న లక్ష్యం కోసం కృషిచేయాలన్నారు. కళాశాల వైస్‌ప్రిన్సిపాల్ కే రవీందర్, ఉపన్యాసకులు మంతెన శ్రీనివాస్, న్యాయవాది ఎండీ ఉమర్ ఉన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ


స్వామి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. అంతకుముందు భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించారు. ఆలయాలకు చేరుకుని అభిషేకం, అర్చన, హోమం, నిత్య కల్యాణం చేయించారు. స్వామివారలను దర్శనం చేసుకున్నారు. రావి చెట్టు ఆంజనేయస్వామి చుట్టు ప్రదక్షిణాలు చేశారు. యమధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, రమణాచార్య, నంబి నరసింహ మూర్తి, ద్యావళ్ల విశ్వనాథశర్మ, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు పాల్గొన్నారు.

కొండగట్టులో..

మల్యాల (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండగట్టు అంజనేయస్వామి ఆలయం శనివారం భక్తులతో సందడిగా మారింది. వేలాది భక్తులు అంజన్నను దర్శించుకున్నారు. స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే బేతాళుడు, శ్రీరాముల ఆలయంలోనూ పూజలు జరిపారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

బడి తోట.. పోషకాల బాట..


బడి ఆవరణలో కూరగాయల తోట


ఒబులాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

- ఆరేళ్లుగా సేంద్రియ పద్ధతిలో కూరగాయల సాగు
- మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు పోషకాహారం
- ఒబులాపూర్ పాఠశాల హెచ్‌ఎం ప్రత్యేక కృషి

తంగళ్లపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పోషకాహారాన్ని, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం ఒబులాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'బడి తోట'ను సాగు చేస్తున్నారు. సేంద్రియ పద్ధతులలో కూరగాయలు, ఆకు కూరలు పండిస్తున్నారు. పాఠశాలకు ఆరు సంవత్సరాల క్రితం బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయుడు గ్రామీణ ప్రాంత పిల్లలకు పోషకాహారాన్ని అందించాలనే ఆలోచనతో బడి తోటకు నాంది పలికారు. అప్పుడే కరోనా మహమ్మారి ప్రపంచాన్ని వణికిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు పోషక విలువగల ఆహారాన్ని అందించాలనే సంకల్పించారు. పాఠశాల ఆవరణలో కూరగాయలు, ఆకుకూరలు సాగు చేయడం ప్రారంభించారు.

● బడితోట రక్షణగా గ్రీన్‌నెట్..

బడి తోట చుట్టూ గ్రీన్‌నెట్ ఏర్పాటు చేసి రక్షణ కల్పిస్తున్నారు. టమాట, బీర, బెండా, సోరకాయ, బీన్స్, గోంగూర మొదలైన ఐరన్ పోషక విలువలు ఎక్కువగా ఉన్న కూరగాయలను పండిస్తున్నారు. పాలకూర, మెంతి, కొత్తిమీర తదితర వాటిని సేంద్రియ పద్ధతిలో పండిస్తున్నారు. ప్రధానోపాధ్యాయుడిది జీవశాస్త్రం సబ్జెక్టు కావడంతో విద్యార్థులకు పోషకాహారం అందించాలనే ఆలోచన చేశారు. ఆరు సంవత్సరాల క్రితం మొదలు పెట్టిన బడి తోట మంచి ఫలితాలను ఇచ్చింది.


తీగజాతి కూరగాయల మొక్కలు

● విరామ సమయంలో మొక్కల సంరక్షణ..

విరామ సమయంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాఠశాల హెచ్‌ఎం సూచనలు, సలహాల మేరకు బడి తోటకు నీళ్లు పెట్టి, కలుపు తీస్తుంటారు. సేంద్రియ ఎరువులు అందిస్తూ రసాయనాలు లేని కూరగాయలు, ఆకుకూరలు పండిస్తూ పోషకలు అందే విధంగా కృషి చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో గ్రామానికి నీటి సరఫరా చేసే ట్యాంకులు ఉండగా, అవి నిండి వృథాగా పోతున్న నీటిని బడి తోటకు మళ్లించి సద్వినియోగం చేస్తున్నారు. ప్రస్తుతం పాఠశాలలో 100 మంది విద్యార్థులు ఉన్నారు.

బడి తోటలో పని చేస్తుంటే ఆనందంగా ఉంటుంది..
- గోగు జశ్వంత్, 9వ తరగతి



బడితోటలో పని చేస్తుంటే ఆనందంగా ఉంటుంది. కలుపు తీయడం వంటి పనులు చేస్తే అలుపు ఉండదు. ఉపాధ్యాయుల సూచనల మేరకు తోట పని చేస్తుంటాం.

సేంద్రియ ఎరువులు అందిస్తాం..
- కొమ్ము లక్ష్మీప్రసన్న, 10వ తరగతి



తోటలో పండించే కూరగాయలు, ఆకుకూరలకు సేంద్రియ ఎరువులు అందిస్తాం. ఆవుపేడ, గొర్రె ఎరువును సరిపోయే మోతాదులో అందిస్తాం. మేము పండించిన కూరగాయలు మధ్యాహ్న భోజనంలో తినడం సంతోషాన్ని ఇస్తోంది.

ఆరవ తరగతి నుంచి..
- దోమకొండ సూర్య, 10వ తరగతి



ఆరో తరగతి చదువుతున్నప్పటి నుంచి బడి తోట పని చేస్తున్నారు. విరామ సమయంలో తోట పనిచేస్తాం. ఆడుతూ సంతోషంగా తోట పని చేస్తాం. పోషకా హారం అందుతుందని పెద్దసారు చెప్పిన మాటలు తప్పకుండా పాటిస్తున్నాను.

విద్యార్థులకు పోషకాహారాన్ని అందించాలనే..
- బండి ఉపేందర్, ప్రధానోపాధ్యాయుడు



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మంచి పోషక విలువలు ఉన్న ఆహారాన్ని అందించాలనే బడి తోట ప్రారంభించాను. ఆరు సంవత్సరాలు కూర గాయలు, ఆకుకూరలను పండిస్తున్నాం. ఒక సంవత్సరం కరోనా మహమ్మా రితో ఇబ్బందులు పడ్డాం. పోషక లోపాలను నివారించడానికి బడితోట దోహదపడు తుంది. పోషకాహారం అందితే విద్యార్థులు పాఠ్యాంశాలపై శ్రద్ధ వహించే అవకాశం ఉంది.

రాజన్న ఆలయ ఈవో బాధ్యతల స్వీకరణ


ఈవోగా బాధ్యతలు చేపడుతున్న రమాదేవి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయ ఈవోగా ఎల్ రమాదేవి శనివారం బాధ్యతలు చేపట్టారు. రాజన్న ఆలయానికి ఉదయం రావడంతో ఆలయ అర్చకులు ఘనస్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజలో పాల్గొన్న అనంతరం కల్యాణ మండపంలో వేద పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. అనంతరం ఈవో చాంబర్‌లో ఇన్‌చార్జి ఈవో రాధాబాయి చేతుల మీదుగా రమాదేవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు నూతన ఈవోను మర్యాదపూర్వకంగా కలిసి రాజన్న చిత్రపటం అంద జేసి సన్మానించారు. ఏఈవో శ్రావణ్‌కుమా ర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌శర్మ, వెల్ది సంతోష్, వెంకటప్రసాద్, రాజేందర్, బొడుసు మహేష్ యాదవ్ ఉన్నారు.

సింగిల్ విండో గోదాం తనిఖీ

ఎలిగేడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాంను కరీంనగర్ ప్రాంతీయ నిఘా విభాగం ఇన్‌స్పెక్టర్ వరుణ్ ప్రసాద్, ఏఈ శ్రీకాంత్ ఆధ్వర్యంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, రాఘవేంద్ర ఫర్టిలైజర్ ఎరువుల దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. వాటి లైసెన్సులు, రికార్డులు, గోడౌన్‌లో ఎరువుల నిల్వలను పరిశీలించారు. స్టాక్ రిజిష్టర్ వివరాలను ఈ-పాస్ మెషిన్‌తో సరిచూసి సంతృప్తి చెందారు. ఎలాంటి తేడా లేవని నిర్ధారించారు. యూరియా ఉన్నట్లయితే రైతులకు విక్రయించాలని, ఎలాంటి నిల్వ ఉంచకూడదని పేర్కొన్నారు. మండల వ్యవసాయ అధికారి ఉమాపతి, ఏఈవో సురేష్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు


హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ఫండస్ హైస్కూల్ గ్రౌండ్‌లో శనివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి మినీ అండర్-12 బాలబాలికల ఎంపిక పోటీలకు స్పందన లభించింది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 150 మంది బాలబాలికలు ఈ పోటీల్లో ప్రతిభచాటారు. కరస్పాండెంట్ పద్మజ, ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డిలు హాజరై పోటీలను ప్రారంభించారు.

ప్రతిభచాటిన క్రీడాకారులను ఆదివారం హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్‌లు తెలిపారు. కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా ఉషు అసోసియేషన్ అధ్యక్షుడు బార విద్యాసాగర్, సంయుక్త కార్యదర్శి నమిలకొండ ప్రభాకర్, హ్యాండ్‌బాల్ కోచ్ మూల వెంకటేశ్, పీడీలు రూపారాణి, తిరుమలేష్, సీనియర్ ప్లేయర్ కానిస్టేబుల్ సిరికొండ శ్రీనివాస్, పీఈటీలు విజయ్, అమర్, సాయి, దుర్గరాజు, శ్రీకాంత్, కనకలక్ష్మి, సంపూర్ణ, కుమార్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కష్టపడితే దేనినైనా సాధించవచ్చు

ఆర్చరీ ప్రపంచ యూత్ చాంపియన్ చికిత



చికితకు స్వాగతం పలుకుతున్న నాయకులు, ఉపాధ్యాయులు, అభినందిస్తున్న కలెక్టర్

ఎలిగేడు, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కృషి, పట్టుదల, అంకితభావంతో ముందుకు వెళితే దేనినైనా సాధించవచ్చని ఆర్చరీ ప్రపంచ యూత్ చాంపియన్ షిప్ విజేత తానిపర్తి చికిత అన్నారు. శనివారం చికిత స్వగ్రామం సుల్తాన్‌పూర్‌లో ఉన్నతపాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. విద్యార్థులు, నాయకులు గ్రామస్థులు ఆమెను ర్యాలీగా పాఠశాలకు తీసుకువచ్చారు. చికిత మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి అనుకున్న రంగంలో రాణించాలనే తపన ఉంటే విజయం సాధించవచ్చన్నారు. ఆర్చరీ క్రీడపై ఇష్టం పెంచుకున్న తనను తల్లిదండ్రులు ప్రోత్సహించారన్నారు. లక్ష్యసాధనలో ఎన్నోకష్టాలు ఎదుర్కొన్నానని, అధైర్యపడకుండా ముందుకే సాగిపోయానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో నరేంద్రచారి, మాజీ సర్పంచ్ అర్షనపల్లి వెంకటేశ్వర్‌రావు, అప్పిడి సంతోష్‌రెడ్డి, తానిపర్తి సుధాకర్‌రావు, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● మాజీ గవర్నర్ దత్తాత్రేయ అభినందన

ఎలిగేడు: ప్రపంచ యూత్ చాంపియన్ షిప్ ఆర్చరీ పోటీల్లో స్వర్ణ పతకం సాధించిన తానిపర్తి చికితకు హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఫోన్ చేసి అభినందనలు తెలిపారు. కెనడా వేదికగా జరిగిన పోటీల్లో చికిత విజయం సాధించడం దేశానికే గర్వకారణని కొనియాడారు.

కలెక్టరేట్‌లో సన్మానం

పెద్దపల్లి కల్చరల్: విలువిద్య క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం అభినందనీయమని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ఆర్చరీ క్రీడాకారిణి తానిపర్తి చికితను ప్రశంసించారు. చికితను కలెక్టరేట్‌లో శనివారం సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడా అధికారి సురేష్, అర్చరీ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కొమురోజు శ్రీనివాస్, జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామ శివారులో శుక్రవారం అర్ధరాత్రి మద్యం సేవించి రోడ్డుపై తిరుగుతున్న ఇద్దరిని బైండోవర్ చేశామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మరోసారి అలాంటి తప్పులు చేకుండా తహసీల్దార్ ఎదుట శనివారం హాజరుపరిచినట్లు తెలిపారు. బైండోవర్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

కొత్త పెన్షన్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలి

- డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘుశంకర్‌రెడ్డి

వేములవాడ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): కొత్త పెన్షన్ విధానాన్ని వెంటన్నే రద్దు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు రఘుంశకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని కొనాయపల్లి ప్రభుత్వ పాఠశాలలో కలెక్టరేట్ వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమం పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం ఉద్యోగులకు, ఉపాధ్యాయుల పాలిట శాపంగా మారిందని వాపోయారు. కొత్త పెన్షన్ విధానం రద్దు కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా సెప్టెంబరు 1వ తేదీ సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ఉద్యోగులందరూ హాజరుకావాలని పిలుపునిచ్చారు. కొత్త పెన్షన్ విధానంపై ఉన్న వ్యతిరేకత ను ప్రభుత్వానికి తెలియజేయాలని కోరారు.

అనంతరం రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు బూర సదానందం మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోసం టీజాక్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1వ తేదీన నిర్వహించే నిరసన కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. సీపీఎస్‌ను రద్దు చేసేంతవరకు ప్రభుత్వంపై పోరాటం చేయడంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నారాయణరెడ్డి, డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి వంగ తిరుపతి, ఉద్యోగులు చకినాల రామ్మోహన్, చక్రపాణి, పర్శరాములు, మల్లేశం, శ్రీనివాస్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయుల సంఘం నాయకులు

ఎస్‌యూలో డిజీ లాకర్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి

గణేశ్‌నగర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో శనివారం యూజీసీ అఫైర్స్ సెల్ ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయ పరిధిలోని అన్ని యూజీ, పీజీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు డిజీ లాకర్‌పై అవగాహన కల్పించారు. డిజీ లాకర్ యాప్‌తో అనుసంధానం చేస్తూ విద్యార్థులకు అకౌంట్ ప్రొఫైల్‌ని క్రియేట్ చేసే విధానంపై కార్యశాల నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్ జాస్తి మాట్లాడుతూ డిజీ లాకర్ యాప్‌తో విద్యార్థులకు తమ సర్టిఫికెట్లు, ఇతర సమాచారం డిజిటల్ రూపంలో పొందుపరచుకోవచ్చని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ ఉన్నా తమ సర్టిఫికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు డిజీ లాకర్ యాప్ ఉపయోగపడుతుందన్నారు. వన్‌నేషన్-వన్ స్టూడెంట్ ఐడీ ఎలా తయారు చేసుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించాలని కళాశాలల ప్రిన్సిపాల్స్ సూచించారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ డి సురేష్‌కుమార్, యూజీసీ ఎఫైర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎ రవికుమార్, విశ్వవిద్యాలయ టెక్నికల్ అసిస్టెంట్ జ్ఞానేశ్వర్, విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజాసైన్స్ ఉద్యమం తాత్వికతపై శిక్షణ తరగతులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఫిలింం భవన్‌లో ప్రజాసైన్స్ ఉద్యమం తాత్వికతపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని జన విజ్ఞాన వేదిక రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు సిలివేరి సంపత్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలో జన విజ్ఞాన వేదిక జిల్లా ముఖ్యనాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సంపత్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పారం లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్లతో పాటు కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల వారికి శిక్షణ తరగుతులు ఉంటాయన్నారు. ఉదయం శాస్త్రం, శాస్త్ర ప్రచారం సవాళ్లు అనే అంశంపై జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపక కన్వీనర్ ప్రొఫెసర్ ఎ రామ చంద్రయ్య, మధ్యాహ్నం ప్రజాసైన్స్ ఉద్యమం తాత్వికత అనుభావాలు అనే అంశాలపై జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి రాజా వివరిస్తారని అన్నారు. ప్రగతిశీల భావాలు కలవారు, సైన్స్ ఉద్యమకారులు, విజ్ఞాన అభిమానులు, కార్యకర్తలు శిక్షణ తరగతుల్లో పాల్గొనాలని కోరారు. జన విజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు.

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

కమాన్‌పూర్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శనివారం కరీంనగర్ నుంచి వచ్చిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో స్టాక్ రిజిష్టర్లు, నిల్వ ఉన్న బస్తాల సంఖ్య, ఈ-పాస్ మెషిన్ అమ్మకాలను పరిశీలించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వరుణ్ ప్రసాద్, మండల వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఏఈ శ్రీకాంత్, హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుల్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం కోసం ప్రమాద బాధితుల పడిగాపులు

- ట్రెజరీలో బీమా డబ్బులు జమ - అనుమతి ఇవ్వని ప్రభుత్వం
- న్యాయం చేయాలంటూ బాధితుల వేడుకోలు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): అదృష్టం కొద్దీ ప్రమాదంలో బతికి బయటపడ్డ వారు కొందరు.. తీవ్ర గాయాలతో మృత్యువు వరకు వెళ్లి బయటపడ్డవారు మరికొందరు. కరీంనగర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఐదారేళ్లుగా జరిగిన వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో గాయపడి చికిత్స పొందిన 44 మంది బాధితులు బీమా సంస్థల పరిహారం కోరుతూ కోర్టును ఆశ్రయించారు. దీంతో జిల్లా కోర్టు బాధితుల స్థితిగతులు పరిశీలించి పరిహారం ఇవ్వాలని గత జూన్ 25వ తేదీన బీమా సంస్థలకు ఆదేశాలు జారీచేసింది. బీమా కంపెనీలు 44 మందికి పరిహారం రెండు కోట్ల 50లక్షల 23వేల 692 రూపాయలను కోర్టులో డిపాజిట్ చేశాయి. దీంతో తమకు న్యాయం జరుగుతుందని బాధితులు, బాధిత కుటుంబసభ్యులు సంతోషప డ్డారు. కోర్టు బీమా కంపెనీలు జమచేసిన మొత్తాన్ని జిల్లా ట్రెజరీలో జమచేసింది. జాబితాను జిల్లా ట్రెజరీ కార్యాలయానికి పంపించారు. దీంతో బాధితులు తమకు బీమా డబ్బులు ఇప్పించాలంటూ జిల్లా ట్రెజరీ కార్యాలయానికి వెళ్లగా ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చే వరకు వాటిని ఇవ్వలేమంటూ సమాధానం చెపుతున్నారని బాధితులు ఆవేదన చెందుతున్నారు. బీమా డబ్బులు తమకు ఇప్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

'శ్రీరాంసాగర్'లోకి భారీ వరద

- 4,50,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- 39 గేట్లు ఎత్తి 5,74,867 క్యూసెక్కుల నీటి విడుదల

జగిత్యాల, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శనివారం భారీగా వరద నీరు వస్తోంది. ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 4,50,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండగా 39 గేట్లు ఎత్తి 5,74,867 క్యూసెక్కుల నీటిని దిగువ గోదావరికి వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 58.004 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

● నిండుకుండలా ఎల్ఎండీ

తిమ్మాపూర్: కరీంనగర్ పరిధిలోని దిగువమానేరు జలాశయం నిండు కుండలా మారింది. ఎల్ఎండీ పూర్తి నీటి సామర్థ్యం 24.034టీఎంసీలు కాగా శనివారం సాయంత్రం 20.901టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ఎంఎంఆర్ గేట్లు శుక్రవారం రాత్రి అధికారులు మూసివేయడంతో ఎల్ఎండీకి ఇన్‌ఫ్లో నిలిచి పోయింది. కేవలం కాలువల ద్వారా 293 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తోంది.

● మిడ్ మానేరులో 25 టీఎంసీలు...

బోయినపల్లి: శ్రీరాజరాజేశ్వర జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 25 టీఎంసీలకు చేరుకుంది. ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా 10,500 క్యూసెక్కులు, మానేరు, ములవాగు ద్వారా 16,577 క్యూసెక్కులు మొత్తం శనివారం సాయంత్రం వరకు 27,077 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. కాగా మిడ్ మానేరు ప్రాజెక్టు నుంచి ప్యాకేజీ 10లోని అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 12,600 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎల్ఎండీ ప్రాజెక్టుకు నీటి విడుదలను నిలివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి నిలువ సామర్థ్యం 27.55 టీఎంసీలకు గాను 25.118 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది.


నిండుకుండలా మిడ్ మానేరు

● ఎల్లంపల్లికి పోటెత్తుతున్న వరద

అంతర్గాం: అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టుకు శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఐదు లక్షల 75వేల క్యూసెక్కులు, వాగులు, వంకల నుంచి లక్షా 200వందల క్యూసెక్కులు మొత్తం 7.59లక్షల క్యూసెక్కుల వరద నీరు పోటెత్తుతుంది. ఎగువ నుంచి ఇంకా వరద వచ్చే అవకాశం ఉన్నందున శనివారం అధికారులు 37 గేట్లు ఎత్తి 7.4లక్షల క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 20 టీఎంసీలకు గాను ప్రస్తుతం 13.7 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్ట్ మీద నుంచి అంతర్గాం, మంచిర్యాలకు రాకపోకలను ప్రాజెక్ట్ అధికారులు నిలిపివేశారు.

'అన్నపూర్ణ' నుంచి నాలుగు పంపులతో ఎత్తిపోతలు


అన్నపూర్ణ రిజర్వాయర్ వద్ద నీటిపారుదలశాఖ అధికారులు

ఇల్లంతకుంట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనంతగిరి గ్రామ సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి తొలిసారిగా నాలుగు పంపులతో నీటిని ఎత్తిపోయడం శనివారం ప్రారంభించారు. అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు 2020 మార్చి 11న ప్రారంభించారు. అప్పటి నుంచి ఒకేసారి నాలుగు పంపులు ఇంతవరకు నీటిని ఎత్తిపోయలేదు. ప్రస్తుతం నాలుగు పంపుల ద్వారా 12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. మధ్యమానేరుకు నీరు ఎక్కువగా వస్తుండటం, పైన ఉన్న ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో నింపాలని ప్రభుత్వం నిర్ణయించడంతో నాలుగు పంప్‌ల ద్వారా నీటిని ఎత్తిపోస్తున్నారు. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 1.42టీఎంసీల నీరు చేరింది. ఎగువన ఉన్న 11వ ప్యాకేజీలోని రంగనాయకసాగర్‌కు 9900 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎస్ఈ రవీందర్‌రెడ్డి, డీఈ ప్రతాప్‌రెడ్డి, ఏఈలు నాగేందర్, సమరసేన, వంశీ, నాగేశ్వర్‌రావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో అన్య మతస్థులను తొలగించాలి

వేములవాడ కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారి అనుబంధ ఆలయమైన శ్రీభీమేశ్వర ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో అన్యమతస్థులను తొలగించాలని బీజేపీ నాయకులు ఈవో రమాదేవికి వినతిపత్రం అందజేశారు. భీమేశ్వర ఆలయంలో శనివారం అన్య మతానికి చెందిన పలువురు వ్యక్తులు చెప్పులు వేసుకుని పనులు చేయడంతో గమనించిన స్థానికులు చెప్పులు బయట విడిచి పనులు చేయాలని సూచించారు. ఈ సంఘటనపై బీజేపీ నాయకులు ఈవో కార్యలయానికి చేరుకుని అన్య మతస్థులను అభివృద్ధి పనుల నుంచి తొలగించాలని వినతిపత్రం అందజేశారు.

అన్య మతస్థుల తొలగింపు : ఈవో

వేములవాడ కల్చరల్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీభీమేశ్వర ఆలయంలో చేపడుతున్న అభివృద్ధిలో అన్యమతస్థులు పని చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వచ్చిన దానిపై ఈవో రమాదేవి స్పందించారు. ఈ సందర్భంగా అన్యమతస్థులను తొలగించాలని ఈవో సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు అందించారు. దీంతో కాంట్రాక్టర్ అన్య మతస్థులను వెంటనే తొలగించామని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని లేటర్ ద్వారా తెలిపినట్లు ఈవో రమాదేవి ఒక ప్రకటనలో వెల్లడించారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్

చందుర్తి, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి సిరికొండ శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో బీజేపీ బూత్ కమిటీల అధ్యక్షుల సమావేశం శని వారం జరిగింది. ఈ సందర్భంగా సిరికొండ శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సెప్టెంబర్ 3న కరీంనగర్ పట్టణానికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు వస్తున్న సందర్భంగా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ పొంచెట్టి రాకేష్, నాయకులు పెరిక గంగరాజు, చిర్రం తిరుపతి, మేడిశెట్టి శ్రీహరి, సిరికొండ తిరుపతి, సుద్దాల రమేష్, ఏడ్ల సురేష్, అజ య్, ఆదిత్య పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు



బండలింగంపల్లి శివారులో ఉధృతంగా ప్రవహిస్తున్న మానేరు వాగు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల పాటు దంచికొట్టిన వాన శనివారం నిలిచింది. ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాలు జలమయమయ్యాయి. మండల కేంద్రాలతో పాటు అక్కపల్లి, కోరుట్లపేట, నారాయణపూర్, పదిర, అల్మాస్‌పూర్, రాజన్నపేట, దుమాల, పదిర, మద్దిమల్ల, గర్జనపల్లి, తదితర గ్రామాల శివారుల్లోని వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. చెరువులు మత్తడి దూకుతున్నాయి. సింగసముద్రం చెరువు, చౌడమ్మ చెరువు, చిట్టివాగు ప్రాజెక్ట్, టేకులపల్లి, రాయిని చెరువులు భారీ నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. వరద రహదారులపై నుంచి పారుతోంది. పలు గ్రామాల్లో రహదారులు కోతలకు గురయ్యాయి. ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు.



కొట్టుకుపోయిన పదిర- రామలక్ష్మణపల్లి గ్రామాల మధ్య రహదారి

12వ రోజుకు చేరిన కార్మికుల సమ్మె

తంగళ్లపల్లి, ఆగష్టు 30 (ఆంధ్రజ్యోతి): కూలి పెంచాలని తంగళ్లపల్లి మండలం బద్దనపల్లి టెక్స్‌టైల్ పార్కు కార్మికుల సమ్మె కొనసాగుతోంది. కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. పలు కార్మిక సంఘాల నాయకులు కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు శ్రీరాముల రమేష్ చంద్ర మాట్లాడుతూ ప్రస్తుతం పార్కులో ఉత్పత్తి అవుతున్న ప్రభుత్వ వస్త్రానికి ఒక మీటరుకు రూ 20లాభం పొందుతున్న యజమానులు కార్మికులకు కూలి పెంచ కపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఎమ్మెల్యే కేటీఆర్, ఎంపీ బండి సంజయ్, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ కేకే మహేందర్‌రెడ్డిలు స్పందించి యజమాన్యంతో చర్చలు జరిపి కార్మికులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు కూచన శంకర్, పలువురు కార్మికులు పాల్గొన్నారు.

యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం విఫలం

కోనరావుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎర్రబెల్లి నాగరాజు ఆరోపించారు. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శనివారం మాట్లాడారు. యూరియా సరిపోక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ జిల్లాకు యూరియా సరిపోయేంత రాలేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతుల కష్టాలు తీర్చాలని కోరారు. సందర్భంగా సీపీఎం నాయకులు మాసం సురేష్, రవి, బాబు, భాస్కర్, రాజు తదితరులు ఉన్నారు.

గంగమ్మ తల్లికి పూజలు

వేములవాడ టౌన్, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ పట్టణంలోని మూలవాగులో శనివారం బీఆర్ఎస్ సీనియర్ నేత, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఏనుగు మనోహర్‌రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి గంగమ్మ తల్లికి పూజలు నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రామతీర్థపు మాధవిరాజు, నాయకులు నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, జోగిని శంకర్, ముద్రకోళ వెంకన్న, చందు, కందుల క్రాంతికుమార్, కొండ కనుకయ్య, నరాల దేవేందర్, ప్రసాద్ రావు, సందీప్, వాసాల శ్రీనివాస్, మ్యాకల శ్రీనివాస్ తదితరలు ఉన్నారు.

గణపయ్యకు ఘనమైన పూజలు



ఎల్లారెడ్డిపేటలో నైవేద్యాలు సమర్పిస్తున్న మహిళ భక్తులు



వేములవాడలో అన్నదానం నిర్వహిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండల కేంద్రాలతో పాటు రాచర్లగొల్లపల్లి, రాచర్లబొప్పాపూర్, రాచర్లతిమ్మాపూర్, దుమాల, అక్కపల్లి, అల్మాస్‌పూర్, రాజన్నపేట, వెంకటాపూర్, బండలింగంపల్లి, కంచర్ల, రంగంపేట, అడవిపదిర, గర్జనపల్లి, వన్‌పల్లి, శాంతినగర్, మద్దిమల్ల తదితర గ్రామాల్లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లోని యువజన, కుల సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధల నడుమ మంగళహారతులు సమర్పించారు. గణపయ్యకు ఘనమైన పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో ఎస్ఐ రాహుల్‌రెడ్డి, నాయకులు ఆదిదేవుడికి దర్శించుకున్నారు. కార్యక్రమంలో యువజన, కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆది దేవుడికి 54 రకాల ప్రసాదాలతో నైవేద్యం

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని మార్కండేయ స్వామి ఆలయంలో స్థానిక పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యనా శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పురోహితులు దయానంద్‌శర్మ నేతృత్వంలో పూజలు అత్యంత వైభవంగా జరిపించారు. మహిళలు భక్తిశ్రద్ధల నడుమ మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. 54 రకాల ప్రసాదాలతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షుడు రాపెల్లి దేవాంతం, ప్రధాన కార్యదర్శి వనం రమేశ్, ఉపాధ్యక్షులు శ్రీరాం సుదర్శన్, గోస్కె దేవదాస్, సంయుక్త కార్యదర్శి రాపల్లి అంబదాస్, జిల్లా ఉపాధ్యక్షుడు పోతు ఆంజనేయులు, దైవశెట్టి సుంకి వేణు, సభ్యులు సుంకి సత్యనారాయణ, వనం వేణు, మ్యాన నాగభూషణం, దుంపేటి శ్రీధర్, పోతు గౌతం పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద అన్నదానం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి నాయకులు నిమ్మశెట్టి విజయ్, నరాల దేవేందర్, మంతె సందీప్, మహేందర్ యాదవ్, గోపు మధు, మారం మహేష్ తదితరులు ఉన్నారు.

● రుద్రంగి : మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ హరినాథ్, కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, డైరెక్టర్లు తీపిరెడ్డి వెంకటరెడ్డి, ఎర్రం గంగా నర్సయ్య, పడాల నరేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భూ హక్కులపై ఆశలు..

(5వ పేజీ తరువాయి)

చర్యలు మాత్రం జరగలేదు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులో మళ్లీ దరఖాస్తులు చేసుకున్నారు. జిల్లాలోని 167 రెవెన్యూ గ్రామాల పరిధిలో సదస్సులు నిర్వహించగా జిల్లాలో భూ సమస్యలపై 6787 మంది దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో మిస్సింగ్ సర్వే నంబర్లు, విస్తీర్ణంలో మార్పులు, చేర్పులు, సాదాబైనామాలు, కోర్టు కేసులు, ఒకరి భూములు మరొకరిపై నమోదు కావడం, పెండింగ్ మ్యుటేషన్ తదితర సమస్యలపై దరఖాస్తులు చేసుకున్నారు. మిస్సింగ్ సర్వే నంబర్లకు సంబంధించి 1393 దరఖాస్తులు, పెండింగ్ మ్యుటేషన్‌కు 295 దరఖాస్తులు, డీఎస్ పెండింగ్‌లో 404దరఖాస్తులు వచ్చాయి. భూమి విస్తీర్ణం, చేర్పులు మార్పులు సంబంధించి 2093 దరఖాస్తులు వచ్చాయి. నిషేధిత జాబితాలో భూములు నమోదు అయినట్లు సవరించడానికి 270 దరఖాస్తులు వచ్చాయి. అసైన్డ్ భూములు, భూసేకరణ, ఇతర రికార్డులకు సంబంధించిన సమస్యలపై 3489 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 1675 సాదాబైనామాల సమస్యలపైనే దరఖాస్తులు వచ్చాయి. బోయినపల్లి మండలంలో 167, చందుర్తిలో 287, ఇల్లంతకుంటలో 200, గంభీరావుపేటలో 192, కోనరావుపేటలో 136, ముస్తాబాద్‌లో 306, సిరిసిల్లలో 13, తంగళ్లపల్లిలో 75, వేములవాడలో 92, వేములవాడ రూరల్‌లో 82, వీర్నపల్లిలో 49, ఎల్లారెడ్డిపేటలో 76 దరఖాస్తులు వచ్చాయి.

● సమస్యల పరిష్కారంపై ఆశలు

కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా ఆర్‌వోఆర్ 2020-25 భూభారతి చట్టాన్ని తీసుకువచ్చింది. భూభారతిపై రైతులకు అవగాహన కల్పించడంతో పాటు సదస్సులు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. భూభారతిలో సాదా బైనామాలు సమస్యలు పరిష్కారం అవుతాయని దరఖాస్తుదారులు ఆశలు ఏర్పడ్డాయి. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో అమలు జరుగుతున్న భూరికార్డుల నిర్వహన పద్ధతులను పరిశీలించిన అనంతరం వ్యవసాయ, వ్యవసాయేతర భూములకు సంబంధించి వేర్వేరు రికార్డులు చేయడానికి ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. భూ రికార్డులు మెరుగ్గా ఉండే విధంగా రైతు సంఘాలు మేధావులు, విద్యావేత్తలు, న్యాయవాదులు ప్రజాప్రతినిధులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగుల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోని భూ భారతి కొత్త చట్టాన్ని తీసుకవచ్చారు. పకడ్బందీగా భూ భారతిలో డేటాను అప్‌లోడ్ చేశారు. 33 నుంచి 6 మాడ్యూల్‌లకు పరిమితం చేశారు. భూమిత్రలో సందేహాలను నివృత్తి చేసే విధంగా చాట్ బోర్డులు ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఏ సందేహం అయినా తీర్చుకునే వీలు కల్పించారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సహకారంతో ఈ చాట్ బోర్డు పని చేసేలా డిజైన్ చేశారు. ధరణి పోర్టల్‌లో వివరాల నమోదు, ఓటీపీ నమోదు వరకు 30 సెకండ్లు అవుతుండగా దీనినే నాలుగు సెకండ్లలోనే వివరాలు అందించేలా స్పీడ్ పెంచారు. 33మాడ్యూల్‌లో కొన్నింటిని అనుసంధానం చేయగా 5, 6 మాడ్యుల్‌లను పూర్తిగా తొలగించారు. 18,19 మాడ్యూల్లను కలిపి ఆరుగా మార్చారు. రైట్ టు ప్రైవసీ చెక్‌ను తొలగించారు. గతంలో ధరణి పోర్టల్‌లో కొందరు తమ భూముల వివరాలను గోప్యంగా ఉంచుకునేందుకు వెసులుబాటు కల్పించిన ప్రైవసీచెక్‌ను పూర్తిగా ఎత్తివేశారు. ప్రతి ఎకరంభూమి వివరాలు ఉండే విధంగా ఏర్పాటు చేశారు. సరళమైన భాషలో జనానికి అర్థమయ్యే విధంగా అంశాలను పొందుపర్చారు.

ఓటరు జాబితా అభ్యంతరాలపై సమావేశం



ఇల్లంతకుంటలో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు



కోనరావుపేటలో పాల్గొన్న అఖిలపక్ష నాయకులు

కోనరావుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : కోనరావుపేట మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఓటర్ జాబితా అభ్యంతరాలపై అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకర్ రెడ్డి, ఏపీఓ శ్రీనివాస్, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మిర్యాల్‌కార్ బాలాజీ, తిరుపతి, పూజ, విమల, చింతల పరుశురాములు తదితరులు ఉన్నారు.

● తంగళ్లపల్లి : గ్రామపంచాయతీ ఎన్నికల ముసాయిదాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మీనారాయణ సమావేశం నిర్వహించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, కాంగ్రెస్ నాయకులు నేరెళ్ల నర్సింగంగౌడ్, మునిగేల రాజు, గుగ్గిళ్ల భరత్‌గౌడ్, చుక్క శేఖర్, ఇటుకల రాజు, కోల ఆంజనేయులు, రమేశ్‌లు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ ఎన్నికలపై ఎంపీడీవో శశికళ రాజకీయపార్టీల నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోమటిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పల్లె నర్సింహ్మారెడ్డి, బీఎస్పీ మండల అధ్యక్షుడు అమర్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎల్లోజి, సీపీఐ నాయకుడు మంద అనీల్‌కుమార్, బట్టి చంద్రమౌళి, కొలుపుల లక్ష్మన్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● ఎల్లారెడ్డిపేట/వీర్నపల్లి : స్థానిక సంస్థలకు సంబంధించిన ఎన్నికల పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితాపై ఎల్లారెడ్డిపేట మండల పరిషత్తు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీవో సత్తయ్య శనివారం సమావేశం నిర్వహించారు. ఎంపీవో రాజు, కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, టీడీపీ మండల అధ్యక్షులు లక్ష్మారెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణహరి, నారాయణగౌడ్ పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ దిష్టిబొమ్మల దహనం



ఎల్లారెడ్డిపేటలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు



తంగళ్లపల్లిలో దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు



కోనరావుపేటలో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని తల్లిపై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రంలో బీజేపీ నాయకులు శనివారం ఆందోళన చేపట్టారు. స్థానిక సాయిబాబా కమాన్ ఎదుట కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై నిరసనకు దిగారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసేందుకు సిద్దమయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ రాహుల్‌రెడ్డి ఆధ్వర్యంలోని పోలీసులు అక్కడకు చేరుకుని అడ్డుకునేందుకు యత్నించారు.నాయకులు పోలీసులకు చిక్కకుండా పరుగులు తీస్తూ రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. గణేశ్, కుమార్, లక్ష్మారెడ్డి, యాదగిరి, వేణు, కిరణ్‌నాయక్, రంజిత్‌కుమార్, రాజు, రవీందర్‌నాయక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

● తంగళ్లపల్లి : మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు, కోల అంజిగౌడ్, కాసుగంటి రాజురావు, ఇటుకల రాజు, కోస్నీ వినయ్ యాదవ్, రెడ్డిమల్ల ఆశీర్వాద్, సిలివేరి ప్రశాంత్, కాళీ చరణ్, ఇటుకల మహేందర్, మీరాల ఎల్లయ్య, నాగుల శ్రీనివాస్, మధుసుదన్, తదితరులు పాల్గొన్నారు.

● వేములవాడ టౌన్ : వేములవాడ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో పట్టణ బీజేపీ నాయకులు రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాపెల్లి శ్రీధర్, అక్కనపెల్లి వివేకరెడ్డి, మేర్గు లక్ష్మణ్ ఉన్నారు.

● కోనరావుపేట : మండల కేంద్రంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు బాలాజీ, సురేష్‌గౌడ్, శ్రీనివాస్, జలందర్, జింక వెంకటి, నోముల బాస్కర్, పొన్నం మహేష్, నర్సయ్య, మహిపాల్ తదితరులు ఉన్నారు.

రుద్రంగి : మండల కేంద్రంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేస్తుండగా పోలీసులు శనివారం అడ్డుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు కర్ణవత్తుల వేణు, మాజీ అధ్యక్షుడు అల్లూరు అశోక్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు గండి శ్రీనివాస్, నాయకులు మల్యాల శ్రీనివాస్, దర్శనపు లింగయ్య, లౌడియా శ్రీనివాస్, అక్కినపల్లి నర్సింగరావు, గడ్డం గణేష్, రాచకొండ గంగనరసయ్య, పండుగు గంగాధర్, బాసని దయానందం, మర్రిపెల్లి దశరథం, నెహూరి కిషన్, లౌడియా మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

● చందుర్తి : మండల కేంద్రంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం చేయడాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అల్లాడి రమేష్, మండల అధ్యక్షుడు మొకిలే విజేందర్, మోత్కుపల్లి రాజశేఖర్, తీపిరెడ్డి మనోహర్‌రెడ్డి, బోరుగాయ తిరుపతి, తోట శంకర్, తదితరులు పాల్గొన్నారు.

● గంభీరావుపేట : మండల కేంద్రంలో రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను శనివారం దహనం చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు కోడె రమేష్, మాజీ అధ్యక్షుడు గంట అశోక్, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు వాజీద్, మండల ప్రధాన కార్యదర్శులు విగ్నేష్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

ఓటు హక్కు కల్పించాలి..

తంగళ్లపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం కేసీఆర్ నగర్ వాసులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒటు హక్కు కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న ఎంపీడీవోకు వినతిపత్రం సమర్పించారు. 1300 ఒట్లు కేసీఆర్‌నగర్‌ను ప్రత్యేక గ్రామపంచాయతీగా ప్రకటించాలని ప్రస్తుతం సాధ్యం కాకపోతే పక్కన ఉన్న గ్రామ పంచాయతీల్లో కలిపి ఒటు హక్కు కల్పించాలని ఎంపీడీవోకు ఇచ్చిన వినతి పత్రంలో కోరారు.

టీఎల్‌ఎం మేళాతో ఉన్నతమైన బోధన

చందుర్తి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : టీఎల్‌ఎం మెళాతో విద్యార్థులకు ఉన్నతమైన బోధన లభిస్తుందని ఎంపీడీవో రాధ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీఎల్‌ఎం మెళాను శనివారం నిర్వహించారు. ఎంఈవో వినయ్‌కుమార్ మండలంలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంటరానితనాన్ని నిర్మూలించాలి

చందుర్తి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అంటరానితనాన్ని నిర్మూలించాలని ఆర్ఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని రామారావుపల్లిలో శనివారం పౌరుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ ఆనందం, పంచాయతీ కార్యదర్శి అంగన్వాడి టీచర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వయ్యారి భామ నిర్మూలనపై అవగాహన

తంగళ్లపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ వాడితే వచ్చే అనార్ధలు, వయ్యారి భామ నిర్మూలనపై తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల శివారులోని అగ్రికల్చర్ కళాశాల ప్రొఫెసర్, విద్యార్థులు రాళ్లపేటలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ మధుకర్‌రావు, డాక్టర ప్రియదర్శినిలు గ్రామస్థులకు ప్లాస్టిక్ వాడకం వల్లే కలిగే హనికర ప్రభావాలు, ఆరోగ్య సమస్యలను వివరించారు. డాక్టర్ సతీష్, డాక్టర్ సంపత్‌కుమార్ తదితరలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

తంగళ్లపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మృతిచెందిన తంగళ్లపల్లి మండలం పద్మనగర్‌కు చెందిన వేముల కరుణాకర్ కుటుంబాన్ని పద్మనగర్ పద్మశాలి సేవా సంఘం, ఆదర్శ క్లబ్ సభ్యులు పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందించారు. పద్మనగర్ చెందిన దాతలు వితరణగా ఇచ్చిన రూ.14700 కుటుంబ సభ్యులకు అందజేశారు. పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు మోర శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కుమ్మరికుంట శ్రీహరి, కోశాధికారి సామల శ్రీనివాస్, ఆదర్శ క్లబ్ అధ్యక్షుడు మోర కిరణ్, దూస రమేష్, వేముల బాలకిషన్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి..

తంగళ్లపల్లి, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఎన్నికల మండల ఇంచారీలు గుండ్లపెల్లి శ్రీనివాస్, చేపూరి నాగరాజులు పిలుపునిచ్చారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయంలో స్థానిక సంస్థల ఎన్నికలపై ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికలపై దిశ నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు గజభీంకర్ రాజన్న, మాజీ ఎంపీపీ పడిగెల మానస రాజు, కోడం సంధ్యరాణి, నాయకులు ఎగుమామిడి వెంకటరమణరెడ్డి, కోడి అంతయ్య, అంకారపు రవీందర్, కందుకూరి రామగౌడ్, కోడం రమేశ్, క్యారం జగత్, బండి జగన్, అనిల్, శ్రీకాంత్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తెనుగువానిపల్లెలో పౌరహక్కులదినోత్సవం

ఇల్లంతకుంట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తెనుగువానిపల్లె గ్రామంలో శనివారం పౌరహక్కుల దినోత్సవం జరిగింది. గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో చట్టం దృష్టిలో అందరు సమానులే అన్నారు. ఎవరైన వివక్షతకు గురి అయితే చట్టం రక్షణ కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సంతోష్‌కుమార్, ఏఎస్సై నేరెళ్ల రాజయ్య, పంచాయతీ కార్యదర్శి గిరిజలతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యెల్లో డే

ఇల్లంతకుంట, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కేరళమాడల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం యెల్లోడే వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు యెల్లోరంగుల బట్టలు ధరించి పాటశాలకు వచ్చారు. విద్యార్థులలో ఉత్సాహన్ని నింపడానికి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహాకులు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణకుమార్, ఉపాధ్యాయులు బీస్సీ, థేరిసా,ల ఆవణ్య, షాలు, చిన్మాయ్, సంధ్య, స్వప్న, ప్రీతి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాచర్లబొప్పాపూర్‌లో రైతు హఠాన్మరణం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు30(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామానికి చెందిన రైతు వంగ చంద్రారెడ్డి(55) గుండెపోటుతో శనివారం మృతి చెందాడని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. గ్రామంలోని చంద్రారెడ్డి తనకున్న 6 ఎకరాల్లో వ్యవసాయం చేస్తూ జీవిస్తున్నాడని పేర్కొన్నారు. ఉదయం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి మందు చల్లి ఇంటికి చేరుకున్నాడని చెప్పారు. భోజనం చేసి విశ్రాంతి తీసుకుంటున్న క్రమంలో మంచంపై నుంచి కింద పడి అస్వస్థతకు గురవడంతో మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారని పేర్కొన్నారు. అప్పటికే చనిపోయాడని వైద్యులు నిర్ధారించారని తెలిపారు. రైతు అకాల మరణంతో గ్రామంలో విషాదం నెలకొంది. మృతుడికి భార్య లక్ష్మీ, కొడుకు శ్రీనివాస్‌రెడ్డి, కూతురు రేఖలు ఉన్నారు.

సేవలు గుర్తింపునిస్తాయి..

కోనరావుపేట ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగులకు సేవలే గుర్తింపును ఇస్తాయని మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య అన్నారు. మండలంలోని సుద్దాలలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చొప్పదండి రవీందర్ పదవీ విరమణ కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కచ్చకాయల ఎల్లయ్య పదవీ విరమణ పొందిన రవీందర్‌ను సత్కరించారు. ప్యాక్స్ వైస్‌చైర్మన్ మహేష్, మాజీ సర్పంచులు కచ్చకాయల బాలరాజు, ఉప్పుల శంకర్ ఉపసర్పంచ్ ఎర్రవెల్లి నాగరాజు, ఎర్రవెల్లి విజయ్, కచ్చకాయల మహేష్, ఉప్పుల అంజయ్య, దొబ్బల లింగయ్య, డి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

● ఇల్లంతకుంట : నిబద్ధతతో పనిచేసిన ఉద్యోగులకు సరైన గుర్తింపు లభిస్తుందని సీపీఎస్ ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ జిల్లా అధ్యక్షుడు అయ్యన్నగారి హరికృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని వెల్జిపూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో ప్రధనోపాధ్యాయుడుగా పనిచేసిన బోనాల లక్ష్మీనారాయణ పదవీవిరమణ సమావేశం శనివారం జరిగింది. ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు కాట్నపెల్లి స్వామిరెడ్డి, ఉపాధ్యాయులు అన్నపూర్ణ, లక్ష్మీనారాయణ, కుమారస్వామి, అరుణ్, అనురాధ, రాజిరెడ్డిలతో పాటు కుటుంబీకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాలువ పనుల పరిశీలన..



కాలువ పనులను పరిశీలిస్తున్న రవీందర్‌రావు

గంభీరావుపేట, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముస్తాఫనగర్ బోదర్ కాలువ పనులను శనివారం నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు పరిశీలించారు. చింతలచెరువు, మసీద్ చెరువు మధ్య బొదర్ కాలువను శుభ్రం చేసేందుకు రైతుల కోరిక మేరకు ఎమ్మెల్యే కేటీఆర్ నిధులను సమకూర్చారు. దీంతో కొండూరు రవీందర్‌రావు కాలువ పనులను పరిశీలించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి, సెస్ డైరెక్టర్ నారాయణరావు, మాజీ మార్కెట్ కమిటి అధ్యక్షుడు దయాకర్‌రావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గంద్యాడపు రాజు, పట్టణ అధ్యక్షుడు వెంకటి, మాజీ వార్డు సభ్యుడు బండ రమేష్, నాయకులు కమలాకర్ రత్నాకర్ తదితరులు ఉన్నారు.

గజసింగవరంలో పరామర్శ

గంభీరావుపేట మండలం గజసింగవరంలో సతీష్ అనే వ్యక్తి ఇటీవల పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా, బాధిత కుటుంబాన్ని నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు శనివారం పరామర్శించారు. అనారోగ్యంతో మృతి చెందిన బాలకిష్టయ్య కుటుంబాన్ని కూడా పరమార్శించారు. గంభీరావుపేటలో ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాస్ మృతిచెందగా ఆయన ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.